ఆకాశవాణి, హైదరాబాద్ విభాగం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 24.06.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రైతుభరోసా నిధుల విడుదల తొమ్మిది రోజుల్లోనే పూర్తవుతున్న సందర్భంగా ఈ సాయంత్రం రైతు విజయోత్సవ సభను రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్వహించనుంది.
2. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను ఈ నెలాఖరులోగా జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని న్యాయ కమిషన్ కు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.
3. తెలంగాణ-ఫ్రాన్స్ మధ్య ద్వైపాక్షిక సహకారానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.
4. వచ్చే మూడు రోజుల్లో రాష్ట్రంలో తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణం విభాగం అంచనా వేసింది.

------------------------------

రైతు భరోసా విజయోత్సవ సభ

తొమ్మిది రోజుల్లోనే రైతుభరోసా కింద నిధుల విడుదల విజవయంతంగా పూర్తయిన నేపథ్యంలో రైతు విజయోత్సవ సభను రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు నిర్వహించనుంది. హైదరాబాద్‌లో సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఈ సాయంత్రం సభను నిర్వహించనున్నారు. ఈ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఉప ముఖ్యమంత్రి భట్టి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఇతర మంత్రులు, రైతు భరోసా లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో, మండలాల్లో, గ్రామాల్లో రైతు పండగ నిర్వహించాలని

ప్రభుత్వం ఆదేశించింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొనాలని సూచించింది.

**డెస్క్**

-----------------------

**మంత్రి వర్గం**

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను ఈ నెలాఖరులోగా జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని న్యాయ కమిషన్ కు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నిన్న సాయంత్రం హైదరాబాద్‌లో జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే హైదరాబాద్ చుట్టూ నిర్మించబోయే ప్రాంతీయ వలయ రహదారి – RRR దక్షిణ భాగం ఎలైన్మెంట్ ప్రతిపాదనలను మంత్రి వర్గం ఆమోదించింది. పరిపాలనా సంస్కరణల్లో భాగంగా ఇకపై ప్రతి మూడు నెలలకోసారి క్యాబినెట్ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. సంగారెడ్డి జిల్లాలో ఇంద్రేశం, జిన్నారం మున్సిపాలిటీల ఏర్పాటుకు సైతం మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీల్లో కమిషనర్లతో పాటుగా వివిధ విభాగాల్లో 316 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది.

**ఎంఎస్ఎల్, డెస్క్**

----------------------------

**మంత్రి శ్రీధర్ బాబు**

తెలంగాణ-ఫ్రాన్స్ దేశం మధ్య ద్వైపాక్షిక సహకారానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సచివాలయంలో ఫ్రెంచ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు ఈ రోజు  సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు చేయడానికి ఉన్న అనుకూలతలను, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. ఏడాదిన్నర వ్యవధిలో రాష్ట్రానికి 3 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. టీజీ ఐపాస్‌ను ఏఐతో అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా ఫ్రెంచ్ సంస్థలను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

**డెస్క్**

----------------------

**బోనాలు సమీక్ష**

ఉజ్జయిని మహంకాళి బోనాలు చరిత్రలో నిలిచిపోయేలా ఏర్పాట్లు  చేయాలని అధికారులను హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఈ రోజు హైదరాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల ఏర్పాట్లపై ఈ ఉదయం మంత్రి పొన్నం సమీక్ష నిర్వహించారు. భక్తుల భద్రత విషయంలో పోలీసులు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**డెస్క్**

**-----------------------**

Early- కాంగ్రెసు:

ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ కీలక రాజకీయ వ్యవహారాల సంఘం (PAC) సమావేశం హైదరాబాద్ లోని పార్టీ కార్యాలయం గాంధీ భవన్ లో ప్రారంభం అయింది. PCC అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, AICC ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్ సహా పలువురు ముఖ్య నాయకులు హాజరయ్యారు. అంతకు ముందు, కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ సమావేశం అయింది. మల్లు రవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కూడా AICC ఇంచార్జ్ హాజరయ్యారు.  సమావేశ వివరాలు వెల్లడి కావలసి ఉంది.

**MSL**

**-------------------------**

**BREAK....**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు వింటున్నారు. మరిన్ని updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ air news_hyd ను ఫాలో అవండి. AIR News Hyderabad YouTube Channel ను సబ్ స్క్రైబ్ చేయండి.

**--------------------**

**పాస్ పోర్టు**

పాస్ పోర్టు దరఖాస్తుల తనిఖీ, ధ్రువీకరణలో తెలంగాణ పోలీసు విభాగం అత్యుత్తమ పనితీరుతో దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. ఈ రోజు దిల్లీలో జరిగిన పాస్ పోర్టు అధికారుల కాన్ఫరెన్స్ లో తెలంగాణ ఇంటెలిజెన్స్ డీజీ శివధర్ రెడ్డి ఉత్తమ సేవా ధ్రువీకరణ పత్రాన్ని స్వీకరించారు. వెరీ ఫాస్ట్ యాప్ ద్వారా అత్యంత వేగంగా పాస్‌పోర్ట్ ధృవీకరణను రాష్ట్ర పోలీసులు పూర్తి చేస్తున్నారు. మూడు పని దినాల్లోనే ఎక్కువ శాతం కేసులను పరిష్కరిస్తున్నారు.

**డెస్క్**

------------------------------

**బీజేపీ విమర్శలు**

ముఖ్యమంత్రి  రేవంత్ రెడ్డి కేబినెట్ సమావేశాలను చర్చలు, సంభాషణల వేదికలుగా మార్చారని, ఎటువంటి నిర్దిష్ట ఫలితాలు లేకుండా చేశారని భారతీయ జనతా పార్టీ ఆరోపించింది. ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జి ఎన్.వి. సుభాష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మంత్రి వర్గ సమావేశాల్లో అర్థవంతమమైన చర్యలు లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని సుభాష్ ఆరోపించారు.

**పీఎస్**

------------------------------

**వాతావరణం**

వచ్చే మూడు రోజుల్లో రాష్ట్రంలో తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణం విభాగం అంచనా వేసింది. ఈ రోజు ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి, హైదరాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు,

మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. అన్ని జిల్లాల్లోనూ గంటకు 30-40 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

**పీఎస్**

---------------------

మిషన్ వాత్సల్య పథకం

ప్రకృతివైపరీత్యాలు, ప్రాణాంతకవ్యాధులు, కుటుంబసమస్యల కారణంగా అనాథలుగా మారిన 18 సంవత్సరాల లోపు పిల్లలకు మిషన్ వాత్సల్య పథకం అండగా నిలుస్తుందని వనపర్తి జిల్లా జిల్లా సంక్షేమ శాఖ అధికారి సుధారాణి తెలిపారు. మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించిన మరిన్న వివరాలను ఆకాశవాణి వివరించారు.

**సౌండ్ బైట్: సుధారాణి,మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి,వనపర్తి జిల్లా**

**పీటీసీ, వనపర్తి జిల్లా**

--------------------

ఉయ్యాలకేంద్రం

పిల్లలను పోషించలేని వారు, లేదా అప్పుడే పుట్టిన శిశువును వద్దనుకునే వారు తమ చిన్నారులను అప్పగించేందుకు కరీంనగర్ మాతా శిశు ఆసుపత్రి లో ఉయ్యాల అనే కొత్త కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. మహిళా, శిశు, సంక్షేమశాఖ, బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఈ శిశువుల స్వీకరణ కేంద్రాన్ని గత నెల ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను మాతా శిశు సంరక్షణ కేంద్రం ఆర్ఎంఓ నవీన ఆకాశవాణికి వివరిస్తూ..

**సౌండ్ బైట్: నవీన ( ఆర్ ఎం ఓ, మాత శిశు సంరక్షణ కేంద్రం, కరీంనగర్ )**

**కరీంనగర్, పీటీసీ**

--------------------

**నిర్మల్ – ఎమ్మెల్యే రామరావ్**

నిర్మల్ జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పిలుపునిచ్చారు. డా.శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఈ రోజు భైంసాలో చేపట్టిన తులసి మొక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశ ప్రజలందరికి ఒకే దేశం ఒకే చట్టం ఉండాలన్న ఉద్దేశంతో భారతీయ జన సంఘ్ ను స్థాపించిన ఘనత శ్యామ్ ప్రసాద్ ముఖర్జీదేనని అన్నారు.

**పిటిసి/నిర్మల్ జిల్లా**

-----------------

మాదక ద్రవ్యాలు

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవాలను పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

డ్రగ్-రహిత సమాజమే లక్ష్యంగా మత్తు పదార్థాలను అరికట్టేందుకు ప్రజలు, యువత , విద్యార్థులు కలిసి కట్టుగా ముందడుగు వేయాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పిలుపునిచ్చారు.

**జగిత్యాల, పీటీసీ**

----------------------

**CLOSING ANNOUNCEMENT**

ఆకాశవాణి ప్రాంతీయ వార్తలు ఇంతటితో సమాప్తం.... తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.

------------------------